## క్లుప్తంగా

### నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మంఅర్బన్: ఖమ్మం అర్బన్ మండల పీఆర్టీయూ నూతన కమిటీని శుక్రవారం ఖమ్మంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొడ్డు రవికిరణ్, ప్రధాన కార్యదర్శిగా ఎ.దర్గయ్య, సహాధ్యక్షులుగా సహదేవ్, కార్యదర్శిగా కె.నాగరాజు నియమితులయ్యారు. ఈమేరకు కమిటీని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్టా శేఖర్, రంగారావులు అభినందించారు.

### పెంచిన ఫీజులు ఉపసంహరించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మం మామిళ్లగూడెం: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ కోర్సుల మొదటి సంవత్సరం విద్యార్థులకు పెంచిన ఫీజులను ఉపసంహరించుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఫీజులను భారీగా పెంచి పేద విద్యార్థులపై భారం మోపడం సరికాదని, తక్షణమే ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు శివ, వంశీ, మనోజ్, నాయకులు పవన్, గోపి, ఉపేందర్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

### కరపత్రాలు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరగబోయే లాఫ్టర్ యోగ జాతీయ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం తెలంగాణ యోగ సంఘం రాష్ట్ర అధ్యక్ష సేవక్, లాఫ్టర్ యోగ సొసైటీ చైర్మన్ మరికంటి వెంకట్ ఖమ్మంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉచిత జాతీయ స్థాయి లాఫ్టర్ యోగ శిక్షణ కేంద్రం అర్బన్ వెలుగుమట్ల ఫారెస్ట్ ఖమ్మం లోగో ఆవిష్కరణతో పాటు లాఫింగ్ యోగ ఫెస్ట్ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకట్, పాషా, శ్రీను, కృష్ణ, సత్యం, రాము పాల్గొన్నారు.

# పాత రోడ్లకు కొత్తరూపు..

**రహదారుల ఆధునికీకరణకు కార్యాచరణ**

- ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు
- 30 కిలో మీటర్ల మేర ప్యాచ్ వర్క్
- నాణ్యతకు కోల్డ్ మిక్స్ వినియోగం



ఖమ్మం-ఇల్లెందు ఆర్‌అండ్‌బీ రోడ్డు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరంలోని ప్రధాన రహదారులకు కొత్త రూపు ఇవ్వడానికి అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. వర్షాలు, రద్దీ కారణంగా దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్లతో పాటు నగరంలోని ముఖ్యమైన మార్గాలను ఆధునికీకరించేందుకు పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాలతో కేఎంసీ కమిషనర్ సూచనల మేరకు అన్ని ప్రధాన రహదారులను ఆధునిక పద్ధతులు, సాంకేతికతను జోడించి అందంగా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే కేఎంసీ పరిధిలోని మున్సిపల్ రోడ్లకు ప్యాచ్ వర్క్‌లను ప్రారంభించగా.. కేఎంసీ ఆధ్వర్యాన ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఆధునికీకరణ, ప్యాచ్‌వర్క్ చేపట్టనున్నారు.

**కోల్డ్ మిక్స్ వినియోగం..**

ప్యాచ్ వర్క్ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో అధికారులు సంప్రదాయ పద్ధతికి భిన్నంగా వర్షాకాలంలో తేమ ఉన్నప్పటికీ రోడ్ల మరమ్మతులకు అనుకూలంగా ఉండే కోల్డ్ మిక్స్‌ను వినియోగించాలని నిర్ణయించారు. ఇది తక్కువ ఉష్ణోగ్రత వద్ద వేసే మిశ్రమం కావడంతో సాధారణ హాట్ మిక్స్ కంటే ఎక్కువ కాలం మన్నుతుందని భావించిన కేఎంసీ కమిషనర్ దీన్ని వినియోగించి పనులను యుద్ధప్రాతిపదికన చేయిస్తున్నారు.

**నెల రోజుల వ్యవధిలో..**

నగరంలో రోడ్ల నిర్వహణపై తరచూ వస్తున్న ఫిర్యాదులు, ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ప్రధాన రోడ్లన్నీ నెల రోజుల్లో ఆధునికీకరించేందుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేశారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఎక్కువగా ఉండే మార్గాల్లోని గుంతలు, పగుళ్లు లేకుండా పనులు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే నగర పరిధిలో ఉన్న సుదీర్ఘమైన ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆశాఖ అధికారులతో శుక్రవారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రత్యేకంగా సమావేశమై కేఎంసీలో ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్ల పొడవు, వాటి ఆధునికీకరణకు అయ్యే ఖర్చు వివరాలను సేకరించారు. నగరంలో కాల్వొడ్డు నుంచి మయూరిసెంటర్, వైరా రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్ నుంచి శ్రీశ్రీ సర్కిల్ వైపు, రాపర్తినగర్ వైపు, బల్లేపల్లి రోడ్డు, బోనకల్ రోడ్డు ప్రకాశ్‌నగర్ రోడ్డు తదితర ప్రాంతాలతో కలుపుకొని మొత్తం 12 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్లు విస్తరించి ఉన్నాయి. వీటిలో 9 కిలోమీటర్ల ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుకు రూ.90 లక్షల వరకు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. దీనిలో రోడ్ల విస్తరణ, కొత్త డ్రెయినేజీల నిర్మాణం, కొత్త రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించిన అంశాలను పొందుపరిచారు.

**ప్రారంభమైన ప్యాచ్‌వర్క్..**

నగరంలోని ఎక్కువగా దెబ్బతిన్న సుమారు 30 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్లపై ప్యాచ్ వర్క్ ప్రారంభించారు. ఈ పనులను కేఎంసీ ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తూ.. రోడ్లపై పెద్ద గుంతలు, పగుళ్లు ఉన్న ప్రాంతాలను గుర్తించి మరమ్మతు చేయిస్తున్నారు. ఇక మయూరిసెంటర్ నుంచి రాపర్తినగర్ వరకు ఉన్న బస్‌డిపో రోడ్డు డివైడర్ తొలగించడంతో ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేసేందుకు పనులను ప్రారంభించారు.



బస్ డిపో రోడ్డులో మరమ్మతులు

**ప్రత్యేక వర్కర్లతో పనులు..**

రోడ్లపై గుంతలు, డివైడర్ల మరమ్మతులకు కేఎంసీ ద్వారా ప్రత్యేక వర్కర్లను నియమించుకుంటున్నారు. ఈనేపథ్యాన కాంట్రాక్ట్ పద్ధతిలో 20 మంది కార్మికులను తీసుకునేందుకు కమిషనర్ నిర్ణయించారు. ఇక నుంచి నగరంలో ఏ రోడ్డులో గుంత పడినా, ఏ డివైడర్ కూలినా వాటిని బాగు చేయడంతో పాటు రంగులు వేయడం వంటి బాధ్యతలు పూర్తిగా వారికే అప్పగించనున్నారు. వీరితో నగరాభివృద్ధి మెరుగుపడనుంది.

**రోడ్లను మెరుగుపరుస్తున్నాం..**



వర్షాలు, ఇతర కారణాలతో దెబ్బతిన్న రోడ్లన్నింటికీ మరమ్మతులు చేయిస్తున్నాం. ఇందుకు ప్రత్యేక వర్కర్లను కాంట్రాక్ట్ పద్ధతిన నియమించి 20 రోజుల్లో రోడ్ల ప్యాచ్‌వర్క్‌లన్నింటిని పూర్తి చేయాలని ఆదేశించాం. రోడ్ల మరమ్మతులకు బీటీ, సీసీని వినియోగించకుండా.. కోల్డ్ మిక్స్ మిశ్రమాన్ని వాడాలని నిర్ణయించాం.

– అభిషేక్ అగస్త్య, కేఎంసీ కమిషనర్

## ‘ఎట్టి పరిస్థితుల్లోనూ బీసీలకు రిజర్వేషన్లు’



ఖమ్మంఅర్బన్: సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్, మార్కెట్ చైర్మన్, తదితరులు

ఖమ్మంఅర్బన్: ఎన్నికల సమయాన ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని.. ఈ విషయాన్ని అడ్డుకునేందుకు కొన్ని పార్టీలు కుట్ర చేస్తున్నాయని డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు పేర్కొన్నారు. ఈమేరకు రిజర్వేషన్ల ద్వారా లబ్ధి చేయనున్న కాంగ్రెస్‌కు బీసీలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఖమ్మంలోని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ మేయర్, మార్కెట్ చైర్మన్, కార్పొరేటర్ కమర్తపు మురళి శుక్రవారం మాట్లాడారు. స్థానిక సంస్థల్లో బీసీలకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వాన 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి సిద్ధమైందని, ఏవైనా అడ్డంకులు ఉన్నా పార్టీ పరంగా రిజర్వేషన్లు వర్తింపజేస్తారని చెప్పారు. కాగా, శనివారం ఖమ్మంలో నిర్వహిస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ స్థాయి సమావేశానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు. ఆత్మ, పీఏసీఎస్‌ఐ చైర్మన్లు దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, తాతా రఘురాం, కార్పొరేటర్లు, నాయకులు లకావత్ సైదులు, మలీదు వెంకటేశ్వర్లు, మనీష్, పల్లెబోయిన చంద్రం, వాంకుడోత్ దీపక్, బండి వెంకన్న, కేలోత్ దేవ్‌సింగ్, బోయినపల్లి లక్ష్మణ్, విజయలక్ష్మి, రెంటాల ప్రసాద్, బాణాల లక్ష్మణ్ పాల్గొన్నారు.

**బీజేపీకి భారీ మూల్యం తప్పదు**

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీ రిజర్వేషన్లు అడ్డుకున్న బీజేపీకి భారీ మూల్యం తప్పదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి హెచ్చరించారు. శుక్రవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. బీసీ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చకుండా బీజేపీ కుట్ర చేస్తోందని, దీని సాధనకు రేపటి నుంచి పెద్ద ఎత్తున ప్రదర్శనలు, ధర్నాలు, ర్యాలీలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగనబోయిన పుల్లారావు, ప్రధాన కార్యదర్శులు మసనం శివరామకృష్ణ, మోడేపల్లి వెంకటాచారిలతో పాటు కేతేపల్లి నాగేశ్వరరావు, మల్లికార్జున్, మసనం శివనాగేశ్వరరావు, కూరపాటి సతీష్, ఉమా తదితరులు పాల్గొన్నారు.

**రిజర్వేషన్లు అమలయ్యేదాకా పోరాడుతాం**

కూసుమంచి: బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం కృషి చేస్తున్నా కొందరు కుట్రలు పన్ని అడ్డుకుంటున్నారని, రిజర్వేషన్లు అమలయ్యేంత వరకు పోరాటం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం పాలేరు నియోజకవర్గ అధ్యక్షుడు శీలం రామకృష్ణ అన్నారు. శుక్రవారం పాలేరు గ్రామంలో రెడ్డి జాగృతి దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. రెడ్డి జాగృతి సంఘం కోర్టుకు వెళ్లడంతోనే రిజర్వేషన్ అమలుకాలేదన్నారు.

## సమస్యల పరిష్కారానికి వినతులు

**కలెక్టర్‌కు..**



ఖమ్మంమామిళ్లగూడెం: కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మంఅర్బన్: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ పెరుగుదల నిరోధక చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని టాప్రా జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం నాగేశ్వరరావు, ఏబీబీడీపీఏ జిల్లా కార్యదర్శి టి.శంకర్రావు, సర్కిల్ ప్రెసిడెంట్ ఆర్.వీరస్వామిలు కోరారు. ఈమేరకు శుక్రవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతి పత్రం అందజేశారు. తిర్మలాచార్యులు, రఘురాం, శ్రీనివాసరావు, గోపీచంద్, మధు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అలాగే భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పడాన్ని విరమించుకోవాలని, సంక్షేమ పథకాలను నేరుగా కార్మిక వర్గానికి అందించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోడ నాగేశ్వరరావు, వెంకన్న శుక్రవారం కలెక్టర్ అనుదీప్, లేబర్ అసిస్టెంట్ కమిషనర్‌లకు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో గుగులోతు పటేల్, కోటపర్తి మాధవరావు, చించావత్ దేవదాస్, సైదులు, రామనరసయ్య, శ్రీను, సందీప్, ఉపేందర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**తహసీల్దార్‌కు..**



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నేలకొండపల్లి: ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ వర్కర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్ పాలేరు డివిజన్ అధ్యక్షుడు ఏటుకూరి రామారావు శుక్రవారం తహసీల్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందించారు. పెన్షనర్లకు ఇచ్చిన రూ.700 కోట్లు ప్రతి నెలా అందిస్తామని చెప్పి ఇవ్వలేదని, ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు చిట్లా భాస్కర్‌రెడ్డి, వల్లంచెట్ల భాస్కర్‌రావు, దండా నరసింహారావు, మంకెన నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

**మున్సిపల్ కమిషనర్‌కు**

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం 23వ డివిజన్‌లోని సమస్యలపై మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యను ఆ డివిజన్ కార్పొరేటర్, మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ షేక్ మక్బూల్ శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ముస్తఫానగర్ రోడ్ నం.3లో కరెంట్ స్తంభాలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని, సీసీ రోడ్డు వేయాలని వినతిలో పేర్కొన్నారు.

## కేఎంసీ సమాచారం..

**ఆక్రమిస్తే జరిమానా..**



సూచనలు చేస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో రోడ్లు, డ్రెయినేజీలు, ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే వెంటనే వాటిని తొలగించడంతో పాటు ఆక్రమణదారులకు జరిమానా విధించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని కాల్వొడ్డు, కరుణగిరి బ్రిడ్జి, వైరా రోడ్డు, బైపాస్ రోడ్డు, బల్లేపల్లి ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన కమిషనర్, రోడ్ల వెంట ఆక్రమణలు, భవన నిర్మాణ సామగ్రి, వ్యర్థాలను గమనించి మాట్లాడారు. రోడ్ల వెంట వ్యర్థాలను తొలగించి, పోసిన వారికి జరిమానా విధించాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ నిత్యం జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్, ఉద్యాన అధికారిణి రాధిక తదితరులు పాల్గొన్నారు.

**ఆక్రమణల తొలగింపు..**

నగరంలోని ఫుట్‌పాత్‌లు, డ్రెయినేజీలను ఆక్రమించి ఏర్పాటు చేసిన నేమ్ బోర్డులు, డబ్బాలు, బండ్లను కేఎంసీ సిబ్బంది తొలగించారు. కేఎంసీ ఏసీపీ వసుంధర, ఉద్యాన అధికారిణి రాధిక ఆధ్వర్యాన టౌన్‌ప్లానింగ్, డీఆర్‌ఎఫ్ సిబ్బంది గట్టయ్య సెంటర్ నుంచి స్టేడియం వరకు, మయూరిసెంటర్ తదితర ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించారు.

## ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక

ఖమ్మం సహకారనగర్: వాహన రంగ సంస్థ రెనాల్ట్ నిస్సాన్‌కు తమ కళాశాలకు చెందిన 65 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలకు ఎంపికైన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్స్ ప్రకాష్ మణి, కళాశాల అకడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్, రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

### వేంకటేశ్వరస్వామి ‘పారువేట’



పారువేటలో పాల్గొన్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని కమాన్‌బజార్‌లో శ్రీస్తంభాద్రి వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి 61వ వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం అశ్వవాహనంపై పారువేట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కొండకింది వేణుగోపాలాచార్యులు, అర్చకులు శేషభట్టర్ రఘునాథచార్యులు, మధుసూదనా చార్యులు, కేశవాచార్యులు, నగర ఐరన్ హార్డ్‌వేర్ అండ్ స్టీల్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### సంకటహర చతుర్థి పూజలు

ఖమ్మం అర్బన్: నగరంలోని ఇందిరానగర్‌లోని బాలగణపతి దేవాలయంలో శుక్రవారం సాయంత్రం సంకటహర చతుర్థి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు నరసింహారావు, నిర్మల దంపతుల సాయంతో ఆలయ ప్రాంగణంలో అల్పాహారం, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థానం ఈఓ వీ.వీ.నరసింహారావు, చైర్మన్ బాజీని వీరయ్య, తిరుపతిరావు, అర్చకులు గిరిధర్, తదితరులు పాల్గొన్నారు.

### లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ర్యాలీ

ఖమ్మంగాంధీచౌక్: మెంటల్ హెల్త్, వెల్ బీయింగ్ అవేర్‌నెస్ వారోత్సవాల్లో భాగంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన శుక్రవారం ఖమ్మంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంచి ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన ఆహార నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు గోంగూర వెంకటేశ్వర్లు, బొల్లికొండ శ్రీనివాసరావు, న్యూట్రీషనిస్ట్ అయ్యదేవర రాంబాబు, లయన్స్ క్లబ్ కార్యదర్శి నాగేశ్వరరావు, కోశాధికారి కృష్ణమూర్తి, పూర్ణచందర్‌రావు, విశ్వేశ్వర రావు, గోవర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### బయో మందులకు అనుమతి తప్పనిసరి



దుకాణంలో తనిఖీ చేస్తున్న సీతారాంరెడ్డి

తిరుమలాయపాలెం: అనుమతులు లేని బయో మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పిండిప్రోలు, తిరుమలాయపాలెం గ్రామాల్లో పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేసి కోర్టు అనుమతి ఉన్న బయో మందులు అమ్ముతున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీకి మించి పురుగుమందులు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మందుల అమ్మకాలపై బిల్లులు ఇవ్వాలని తెలిపారు.

## సంక్షిప్తంగా..

### హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియనాయక్

కామేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయాన ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ విమర్శించారు. శుక్రవారం కెప్టెన్‌బంజరలో ఆమె మాట్లాడుతూ.. అమలు కానీ హామీలు ఇచ్చి, బీసీ రిజర్వేషన్ అంటూ నమ్మించి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. బీసీలకు న్యాయం జరిగే వరకు బీఆర్‌ఎస్ పోరాడుతుందన్నారు. అనంతరం కెప్టెన్‌బంజర, కామేపల్లిలో మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంతోటి అచ్చయ్య, మల్లెంపాటి శ్రీనివాసరావు, వడియాల కృష్ణారెడ్డి, సామా మోహన్‌రెడ్డి, మూడ్ కృష్ణప్రసాద్‌నాయక్, గుంపెనపల్లి అనంతరాములు, కాట్రాల రాంబాబు, నున్నావత్ సూర్య, ఆదూరి ప్రసాద్, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

### రూ.10 వేలు చెల్లిస్తేనే వ్యాపారాలు



సూచనలు చేస్తున్న టీఎంసీ సుజాత

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న వీధి వ్యాపారుల ప్రాంగణంలో అధికారికంగా వ్యాపారం చేసుకోవాలనుకునే వ్యాపారులు కేఎంసీకి రూ.10 వేలు నగదు డిపాజిట్ కింద జమ చేయాలని మెప్మా టీఎంసీ జి.సుజాత సూచించారు. శుక్రవారం వీధి వ్యాపారుల ప్రాంగణంలో వ్యాపారులతో మెప్మా అధికారులు సమావేశమై మాట్లాడుతూ.. వీధి వ్యాపారుల ప్రాంగణం నిర్వహణ, శానిటేషన్ ఖర్చుల కోసం శనివారం నుంచి మూడు రోజుల పాటు డిపాజిట్‌లు స్వీకరించబడుతుందన్నారు. కేఎంసీ అధికారులకు సహకరించి వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు.

### విద్యార్థుల క్షేత్రస్థాయి పరిశీలన

తిరుమలాయపాలెం: ప్రయోగాలు, ప్రాజెక్టులు, క్షేత్ర పదర్శనల ద్వారా విద్యార్థుల్లో పఠనాసక్తి పెరుగుదలతో పాటు వారిలోని ప్రతిభను వెలికి తీయొచ్చని సైన్స్ ఉపాధ్యాయుడు పెసర ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిరుమలాయపాలెం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైన్స్ పాఠ్యాంశాలలోని విషయాలను ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా నిల్వ నీటిలో దోమల ఎలా వృద్ధి చెందుతాయి, వరి నాట్లు వేసే విధానాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు.

### మహిళల భద్రతపై అవగాహన

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యాన శుక్రవారం షీ టీం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు మానవ అక్రమ రవాణా, మహిళలపై దాడులు, ర్యాగింగ్, డ్రగ్స్, మహిళలపై అత్యాచారాలు వంటి సమస్యలపై షీటీం బృందం అవగాహన కల్పించింది. అలాగే ప్రమాద సందర్భాల్లో ఆత్మరక్షణకు చేపట్టాల్సిన అంశాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వెంకటేశ్వరరావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

### ‘హార్వెస్ట్’లో మానసిక ఆరోగ్య దినోత్సవం



వేడుకలో పాల్గొన్న యాజమాన్యం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డిలు మాట్లాడుతూ.. మనస్సు ఆరోగ్యమే మన జీవన శక్తి అనే అంశంపై విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించామన్నారు. తొలుత ప్రపంచ ఆరోగ్యాన్ని కోరుతూ బెలూన్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

### మూట నుంచి బయటకొచ్చిన చీర

ఖమ్మంమయూరిసెంటర్: మహిళా సంఘాల సభ్యులకు ‘రేవంతన్న కానుక’పేరుతో అందించే చీరలు గురువారం కేఎంసీకి చేరాయి. ఈ మేరకు చీరల బేళ్లను అధికారులు శానిటేషన్ సిబ్బందితో శుక్రవారం రెండో అంతస్తులోని హాల్‌కు తరలించారు. అయితే ఒక చీరతో కూడిన సంచి హాల్ కిటికీలోంచి బయట పడింది. అప్పుడే కార్యాలయానికి వస్తున్న మెప్మా సిబ్బంది ఈ విషయాన్ని గమనించి చీర బయటకు ఎలా వచ్చిందని ఆరా తీశారు. ఎవరో కావాలనే మూట నుంచి తీసి బయట వేసి ఉంటారని భావిస్తూ సిబ్బందిని ప్రశ్నించారు. అయితే, అధికారి పర్యవేక్షణ లోపంతోనే ఇలా జరిగిందని తెలుస్తుండగా, కేఎంసీ అధికారులు మాత్రం మూట చినగడంతో సంచి బయటకు వచ్చిందని చెప్పడం గమనార్హం.

### వ్యాపారి ఆత్మహత్యాయత్నం?

నేలకొండపల్లి: మండల కేంద్రానికి ఓ వ్యాపారి శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సదరు వ్యాపారి షాప్‌నకు వెళ్తున్నట్లు చెప్పి ఇంటికి బయలుదేరాడు. కానీ షాప్ తీయకపోగా, ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండడంతో కుటుంబీకులు వెతకడం ప్రారంభించారు. చివరకు రాత్రి ఆయన షాప్ గోదాంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా.. నేలకొండపల్లిలో ప్రాథమిక చికిత్స చేయించారు. ఆతర్వాత ఖమ్మం తీసుకెళ్లేందుకు 108 వాహనం అందుబాటులో లేక ప్రైవేట్ వాహనంలో తరలించారు. అయితే, ఆయన ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

### గట్టెక్కిన గండం..



**సాక్షి ఎఫెక్ట్..**

నగరంలోని నిత్యం రద్దీగా ఉండే తెలంగాణ తల్లి విగ్రహం కూడలి వద్ద రోడ్డు దెబ్బతిని అండర్‌గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ పైపులైన్ బయటకు వచ్చాయి. దీంతో శుక్రవారం ‘సాక్షి’లో ‘పొంచి ఉన్న ప్రమాదం’ శీర్షికతో ప్రచురితమవగా.. అధికారులు స్పందించారు. ఈ పైపులైన్‌పై కంకర, డాంబర్ పోసి తాత్కాలికంగా సరిచేశారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

### నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంవ్యవసాయం/ఖమ్మంఅర్బన్/నేలకొండపల్లి/ఖమ్మంరూరల్: నగరంలోని పలు సబ్‌స్టేషన్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా నేడు(శనివారం) పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు ప్రకటించారు. ఈనేపథ్యాన నగరంలోని రిక్కాబజార్ 11 కేవీ ఫీడర్ పరిధిలో, 33/11 కేవీ గాంధీచౌక్ పరిధిలో, 33/11 కేవీ రాపర్తినగర్ సబ్‌ స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే ఎన్‌ఎస్‌పీ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇల్లెందు క్రాస్‌రోడ్‌లోని సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ ప్రశాంత్‌నగర్ ఫీడర్‌లో ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఖమ్మంరూరల్ మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో వరంగల్ క్రాస్‌రోడ్‌లో గల సబ్‌స్టేషన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా బంద్ ఉంటుందన్నారు.

### 13న అప్రెంటిస్‌షిప్ మేళా

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 13వ తేదీన జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ కన్వీనర్, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో హైదరాబాద్‌కు చెందిన ఎంఎన్‌సీ కంపెనీలు, జిల్లా లోకల్ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు www.apprenticeship.india.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకుని అప్రెంటిషిప్ రిజిస్ట్రేషన్ కాపీతో పాటు ఎస్‌ఎస్‌సీ మెమో, ఐటీఐ మెమో, కుల ధ్రువీకరణపత్రం, రెండు పాస్‌ఫొటోలతో మేళాకు హాజరు కావాలన్నారు.

## తెలుగుదనం ఉట్టిపడేలా..

అచ్చ తెలుగుదనం ఉట్టిపడేలా అట్లతద్ది(ఉయ్యాల పండుగ) వేడుకను శుక్రవారం మహిళలు ఘనంగా జరుపుకున్నారు. పెళ్లికాని యువతులు మంచి జీవిత భాగస్వామి రావాలని, పెళ్లయిన మహిళలు భర్త దీర్ఘాయుష్షుతో ఉండాలని ఈ పండుగను జరుపుకుంటారు. పురాణాల ప్రకారం శివుడిని భర్తగా పొందడం కోసం గౌరీదేవి ఈ వ్రతాన్ని ఆచరించినట్లుగా చెబుతారు. పండుగ రోజున ఆడపడుచులు ఒకరికి ఒకరు అట్లు వాయనంగా ఇచ్చిపుచ్చుకున్నారు. యువతులు ఇళ్ల వద్ద ఉయ్యాల కట్టి ఉత్సాహంగా ఊగారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్





పూల కంకణాలతో మహిళలు



వీడీవోస్ కాలనీలో ఉయ్యాల ఊగుతున్న మహిళలు